

ప్రభుత్వాసుపత్రిలో మరిన్ని మెరుగైన సేవలు : మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఇమిడి సత్యనారాయణ వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో కార్పొరేటర్ స్థాయికి మించి మెరుగైన వైద్య సేవలు అందుతాయని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన భవన నిర్మాణ పనులను ఇసిఎల్ సంస్థ ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో 50 పడకల ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచడంతోపాటు నూతన భవనానికి రూ.12.60 కోట్ల నిధులు తీసుకొచ్చానని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు ఐదేళ్లలో పూర్తికాకపోగా జరిగిన పనులు పూర్తిగా నాశిరకంగా జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆ పనులను సరి దిద్దుతూ త్వరలో ప్రారంభం జరుపుకునేలా పనులను వేగవంతం చేశామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ యర్రా మాధురి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పాల్గొన్నారు.

కబళిస్తున్న కాలుష్యం..!

ఆక్వా కంపెనీల్లో నిబంధనలు బేఖాతరు

చోద్యం చూస్తున్న కాలుష్య నియంత్రణ అధికారులు

కానరాని ట్రీట్‌మెంట్ ప్లాంట్లు

విపరీతమైన దుర్వాసనతో తల్లడిల్లుతున్న జనం



సీసలిలో అలంకారప్రాయంగా ట్రీట్ మెంట్ ప్లాంట్



సీసలిలో పరిశ్రమలోని నీటిని కాలువలోకి వదిలేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కాళ్ల

డెల్టాలో పలు ఆక్వా ప్రాసెసింగ్ కంపెనీలు పర్యావరణానికి తీవ్ర విఘాతాన్ని కల్గిస్తున్నాయి. కాలుష్య వ్యర్థాలు యథేచ్ఛగా విడుదల చేయడంతో విపరీతమైన దుర్వాసనతో ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఇటు అధికారులుగాని, అటు యాజమాన్యాలుగాని పట్టించుకున్న దాఖలాల్లేవు. దీనికి నిదర్శనం సీసలి, పెదఅమిరం గ్రామాల పరిసరాలే. పెదఅమిరం-సీసలి ప్రధాన రహదారి వెంబడి మురుగు కాల్వ నిండా కలుషిత వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ముక్కుమూసుకుని వెళ్లక తప్పని పరిస్థితి. కాలువల్లోకి నేరుగా వ్యర్థ జలాలను విడిచిపెడితే చర్యలు తప్పవని అధికారుల హెచ్చరికలను సైతం ఆక్వా పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. రొయ్యల ప్రాసెసింగ్ పరిశ్రమల నుంచి కలుషిత వ్యర్థాలను నేరుగా కాలువల్లోకి విడిచిపెడుతుండటంతో అనేక సమస్యలు ముసురుకుంటున్నాయి.

రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలను స్థాపించేందుకు అనేక నిబంధనలు ఉన్నాయి. రొయ్యలను ప్రాసెసింగ్ చేసే క్వాంటిటీని బట్టి సంబంధిత కంపెనీలు తప్పనిసరిగా 'ఎఫిబియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' ఏర్పాటు చేసుకోవాలి. రొయ్యలను ప్రాసెసింగ్ చేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను కాలువల్లోగాని, రోడ్లపైగాని, మురుగు డ్రెయిన్లలోకిగాని వదలరాదు. ప్రాసెసింగ్ తర్వాత వచ్చే వ్యర్థాలను ఈ ఎఫిబియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి వదిలి, వాటిని రీసైక్లింగ్ చేసిన తర్వాత వచ్చిన నీటిని కంపెనీకి సంబంధించిన వ్యవసాయ భూమి అవసరాలకు ఉపయోగించు కోవాలి. అయితే ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు ఈ నిబంధనలేవీ పాటించడం లేదు. ఇలా పైన ఏర్పాట్లు చేసుకోవడంతోపాటు కంపెనీ ఆధీనంలో ఉన్న మూడెకరాల వ్యవసాయ భూమికి అనుసంధానమై ఉండాలి. ఇవేమీ లేకుండానే నిర్వాహకులు పరిశ్రమలు నడిపేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కంపెనీల్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు అలంకారప్రాయంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రొయ్యలను ప్రాసెసింగ్ చేసిన తర్వాత విడుదలయ్యే వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో శుద్ధి చేయకుండానే సమీపంలోని డ్రెయిన్లలోకి నిర్భయంగా వదిలేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పర్యవేక్షించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఈ అనధికార ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లపై దృష్టి సారించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



పెదఅమిరంలో మురుగు కాలువలో పరిశ్రమల కలుషిత వ్యర్థాలు

నోటీసులిచ్చాం..

లీలా ప్రసన్న, డ్రెయినేజీ శాఖ ఎఇ

మురుగు కాల్వల్లోకి, బోదెల్లోకి నేరుగా వ్యర్థ జలాలను వదులుతున్న పరిశ్రమలకు నోటీసులిచ్చాం. పరిశ్రమల కాలుష్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లెటర్ రాస్తాం. నీటి సంఘాల ఆధ్వర్యంలో కాల్వల ప్రక్షాళన పనులు చేపట్టాల్సి ఉంది. ఈ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతాం.

మచ్చలేని మహా మనిషి అల్లూరు సత్యనారాయణ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం



అల్లూరి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

కమ్యూనిస్టు నేత, కార్మికోద్యమ నేత అల్లూరి సత్యనారాయణ అగ్రకులంలో పుట్టినా తన యావత్తు జీవితాన్ని కార్మిక, కర్షక అణగారిన వర్గాలకు అంకితం చేసిన మచ్చలేని మహా మనిషి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. స్థానిక మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన అల్లూరి సత్యనారాయణ 11వ వర్థంతి శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లిలో జన్మించిన అల్లూరి సత్యనారాయణ సోషలిస్టు భావాలకు ఆకర్షితుడై విద్యార్థి దశలోనే స్వాతంత్రోద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. అనంతరం కమ్యూనిస్టు ఉద్యమం వైపు వచ్చారని, సిపిఎం ఏర్పడిన తర్వాత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ప్రధాన కార్యదర్శిగా చాలాకాలంపాటు పని చేశారన్నారు. ఎంతో నిరాడంబరంగా మచ్చలేని జీవితాన్ని గడిపారన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ప్రజానీకం అంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గొర్ల రామకృష్ణ, ఇంజేటి శ్రీనివాస్, కార్యకర్తలు ఎం.వైకుంఠరావు, గంగరాజు, కోదండం, ఎత పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో దేశాభివృద్ధికి కృషి

రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ

అల్లూరి జీవితం గర్వకారణం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిదాయక జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన స్ఫూర్తితో యువత దేశాభివృద్ధికి పాటుపడాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. స్థానిక అల్లూరి కాంస్య విగ్రహం వద్ద, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం వద్ద అల్లూరి 128వ జయంతి అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పాకా సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి నయీం అస్మి, పిపిసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ నాగరాణి, ఎంఎల్‌సి రామాంజనేయులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఎఎస్‌పి భీమారావు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, పలువురు ప్రముఖులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, రాజ్యసభ సభ్యులు, ఎస్‌పి, ఎంఎల్‌సి

సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం నిర్మించాల్సిందే

లేనిపక్షంలో ప్రజా ఉద్యమం తీవ్రతరం

ఒక రోజు దీక్షలో అల్లూరి మెమోరియల్ హాలు సాధన కమిటీ స్పష్టం


డంపింగ్ యార్డులా మార్చేశారు

సాధన కమిటీ గౌరవాధ్యక్షులు సత్యనారాయణరాజు

రాష్ట్రానికి తలమానికంగా ఉండేలా భవనం నిర్మించాలి: బలరాం

మెమోరియల్ హాల్ నిర్మిస్తేనే నిజమైన నివాళి : గోపాలన్

దీక్షకు సంఘీభావం తెలిపిన శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఎందరో స్వాతంత్ర సమరయోధులు నడయాడిన నేలపై తెలుగుజాతి ముద్దుబిడ్డ, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును ఘోరంగా అవమానించడం అత్యంత బాధాకరమని అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ సాధన కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. అల్లూరి జయంతి, వర్థంతికి నివాళులు అర్పించి చేతులు దులుపుకునే వారంతా అల్లూరికి జరిగిన అవమానాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేసింది. భీమవరం పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు స్మారక కేంద్రాన్ని నిర్మించకపోతే అందిరినీ కలుపుకొని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించింది. పాత బస్‌స్టాండ్ వద్ద తొలగించిన అల్లూరి సీతారామరాజు భవనం స్థానంలో అల్లూరి సీతారామరాజు' సాంస్కృతిక కేంద్రం నిర్మించాలని అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఒకరోజు రిలే నిరాహార దీక్ష స్థానిక ప్రకాశం చౌక్‌లో శుక్రవారం చేపట్టారు. ఈ దీక్షలో సాధన కమిటీ సభ్యులు బి.బలరాం, జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి కూర్చున్నారు. సాధన కమిటీ గౌరవాధ్యక్షులు కనుమూరి సత్యనారాయణరాజు దీక్షాధారులకు ఎర్ర కండువాలు వేసి దీక్షను ప్రారంభించారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని అల్లూరి చిత్రపటానికి కనుమూరి సత్యనారాయణరాజు, సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ గతంలో తాను అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు వ్యవస్థాపకునిగా ఉన్నానని తెలిపారు. ఆనాడు మా విజ్ఞాపనల మేరకు ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధుల పేరిట స్థలం కేటాయించిందన్నారు. అనంతరం ఈ మెమోరియల్ హాలును విరాళాలు సేకరించి నిర్మించామన్నారు. నిర్వహణా బాధ్యత భీమవరం మున్సిపాలిటీ తీసుకుందన్నారు. దీనిలో కొద్దిస్థలాన్ని పాస్‌పోర్ట్ కార్యాలయానికి కేటాయించారన్నారు. హాలు శిథిలమైపోయిందని తొలగించి, తిరిగి నిర్మిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం చేపట్టలేదన్నారు. ప్రస్తుతం స్థలంలో చెత్తను వేసి డంపింగ్ యార్డుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధన కమిటీ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ అల్లూరి స్మారక భవనం దశాబ్దాల తరబడి భీమవరం పరిసర గ్రామాల ప్రజలకు విశేషమైన సేవలందించిందని గుర్తు చేశారు. సాంస్కృతిక, కళా, సాహిత్య, ప్రజా కార్యకలాపాలకు ఏకైక భవనంగా విరాజిల్లిందన్నారు. మున్సిపల్ పాలకుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి గురై పూర్తిగా పాడవ్వడంతో హాలును తొలగించి ఏళ్లు గడుస్తున్నా నిర్మించకుండా కాలయాపన చేశారని విమర్శించారు. తొలగించిన భవనం స్థానంలో అల్లూరి సీతారామరాజు పేరుతో నాలుగు అంతస్తుల భవనాన్ని అన్ని వసతులతో జిల్లాకు, రాష్ట్రానికి తలమానికంగా ఉండేలా అల్లూరి స్మారక కేంద్రంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. పాస్‌పోర్టు కేంద్రాన్ని కూడా వేరేచోటుకి ప్రజలకు అసౌకర్యం లేకుండా తరలించాలని కోరారు. సాధన కమిటీ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ వెంటనే ఆ స్థలాన్ని శుభ్రంచేసి నిర్మాణం చేపడితేనే అల్లూరికి నిజమైన నివాళులు అర్పించినట్లన్నారు. రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర నాయకులు కృష్ణారావు మాట్లాడుతూ అల్లూరి ఆశయాలకు, అభ్యుదయ భావాలకు అనుగుణంగా ఎవరూ పని చేయడం లేదన్నారు. సాధన కమిటీ నాయకులు కంతేటి వెంకటరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, మాట్లాడుతూ అల్లూరి మెమోరియల్ హాలును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.వైకుంఠరావు, సిపిఐ నాయకులు సీతారాం ప్రసాద్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు దండు శివరామరాజు, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బొక్కా సత్యనారాయణ, రైతు కార్యాచరణ సమితి నాయకులు సుబ్బరాజు, కార్యకర్తలు సిహెచ్.వరలక్ష్మి, వడుగు వెంకటేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న సాధన కమిటీ సభ్యులు బలరాం

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

అల్లూరి మెమోరియల్ హాలు సాధన కమిటీ చేపట్టిన నిరాహార దీక్షా శిబిరాన్ని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సందర్శించి దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ ఎంతోమందికి ఉపయోగపడిన మెమోరియల్ హాలు లేకపోవడం బాధాకరమన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

విధుల్లోకి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ప్రభుత్వ సానుకూల స్పందనతో సమ్మె తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కొద్ది రోజులుగా చేపట్టిన సమ్మెను మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం తాత్కాలికంగా విరమించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జెఎసి నాయకులు మద్రిపూడి సతీష్ కుమార్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఇంజినీర్ రమణ సమక్షంలో కార్మికులు సమ్మెను విరమించాలని చెప్పారు.



నిమ్మరం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న కమిషనర్

నరసాపురం: 12 రోజులుగా సమ్మెలో ఉన్న ఇంజినీరింగ్ విభాగ కార్మికులు శుక్రవారం సమ్మె విరమించారు. అనంతరం కమిషనర్ అంజయ్యను కలిసి సమ్మె విరమిస్తున్నట్లు నోటీసు అందించారు. ఈ కార్యక్రమంలో రత్నం, శ్యామ్, బత్తుల శ్రీను, కాశీ, సుజాత, కళ్యాణి, సత్యనారాయణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఆచంటలో మాట్లాడుతున్న కె.రాజా రామ్మోహన్‌రాయ్

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీ బుధవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో అంతా పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన చేపట్టిన జీపుజాతా రెండో రోజు శుక్రవారం ఆచంట కచేరి సెంటర్లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ వైట్ల ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని కోరారు. కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును పాలకులు నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి దిగుపాటి జ్యోతి, సిఐటియు జిల్లా నాయకులు సూర్నీడి వెంకటేశ్వరరావు, నాయకులు పి.మోహన్‌రావు, పిల్లి ప్రసాద్, కాకర వెంకటేశ్వర్లు, దాసిరెడ్డి కోటేశ్వరరావు, కేతా నాగాంజనేయులు, పొరుపల్లి ఏసురత్నం, తలుపూరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, నెక్కంటి కృష్ణమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి పాల్గొన్నారు.

పాలకొల్లు: సార్వత్రిక సమ్మె ప్రచార జీపు జాతా శుక్రవారం పాలకొల్లు చేరింది. ఈ సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆంజనేయులు, వివిధ యూనియన్ల నేతలు వై.రాణి, పిల్లి ప్రసాద్, జవ్వాది శ్రీనివాస్, దేవ సుధాకర్, చల్లా సోమేశ్వరరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

నరసాపురం: ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సూర్నీడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుండి గాంధీ బొమ్మ సెంటర్, పంజా సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాస్, తెలగంశెట్టి సత్యనారాయణ, ఆంజనేయులు, రాణి, గణేష్, పొన్నాడ మల్లేష్, పులపర్తి సత్యనారాయణ, పి.సత్తిబాబు పాల్గొన్నారు.

మొగల్తూరు: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీపుజాతా శుక్రవారం మొగల్తూరు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఆశాలు, అంగనవాడీలు, జట్టు కార్మికులు పాల్గొన్నారు.

ఆరవల్లి దళితపేటలో ఆర్‌డిఒ, డిఎస్‌పి వెంటనే పర్యటించాలి

గ్రామంలోని అన్ని కులాల వారితో శాంతి కమిటీ వేయాలి

కెవిపిఎస్ నేత, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్

ఆరవల్లి ఘటనపై నిజనిర్ధారణ కమిటీగా కెవిపిఎస్ బృందం పర్యటన



మాట్లాడుతున్న దిగుపాటి రాజగోపాల్

ప్రజాశక్తి - అత్తిలి

మండలంలోని ఆరవల్లిలో గత నెల 23న ఎస్‌సి ఉపకులాల మధ్య జరిగిన పరస్పర దాడులపై కెవిపిఎస్ జిల్లా బృందం నిజనిర్ధారణకు శుక్రవారం ఆ గ్రామంలో పర్యటించింది. దళితపేటలో శాంతియుత శిబిరంలో కూర్చున్న ఒక తరగతి ప్రజలను బృందం కలిసి వివరాలు తెలుసుకుంది. గాయపడిన వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మరో తరగతి ప్రజలు అందుబాటులో లేకపోవడంతో కలవలేకపోయారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ ఆరవల్లి గ్రామంలో దళితుల మధ్య పరస్పర దాడులు బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సామరస్యపూర్వకంగా, శాంతియుతంగా ఈ గొడవలను ముగించాలన్నారు. ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతి, సామరస్యం నెలకొనేలా అధికారులు ప్రయత్నించాలన్నారు. గ్రామంలో వేసిన శాంతి కమిటీ ఘర్షణలను పెంచేలా ఉందన్నారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, ఇతర సామాజిక తరగతుల పెద్దలు, ఎస్‌సి ఉపకులాల్లో ఉన్న ఇరు తరగతుల సభ్యులతోపాటు గ్రామ పెద్దలను కలిపి శాంతికమిటీ వేస్తే గ్రామంలో శాంతి వస్తుందన్నారు. అంతేగాని బయట ఊరి వాళ్లను, కులసంఘాల నాయకులను శాంతి కమిటీలో వేయడం వల్ల ఉపయోగం లేదన్నారు. శాంతి కమిటీలో ఉన్న నాయకులే ఈ ఘటనపై వారి వారి ఉపకులాలను కలిసి సమావేశాలు పెడుతున్నట్లు చెబుతున్నారని, ఇది సరైనది కాదని అన్నారు. రెండు ఉప కులాల నాయకులు గ్రామంలో శాంతి చేకూరేలా కృషి చేయాలన్నారు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం వైద్య సహాయాన్ని ఉచితంగా అందించేలా కృషి చేయాలన్నారు. ఎస్‌సి నిధులు లేదా ఎన్‌టిఆర్ వైద్య భరోసా కింద వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు రాష్ట్రంలో, దేశంలో రిజర్వేషన్లు తీసేయాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తుంటే, రాజ్యాంగాన్ని సవరించాలని కుట్ర పన్నుతుంటే దళితులంతా ఐక్యంగా పోరాడాల్సిన సమయంలో దళితుల మధ్య ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని, ఇరుపక్షాల మధ్య సామరస్యపూర్వక వాతావరణాన్ని తెచ్చేలా అధికారులు ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు.

ఇప్పటికీ దళితపేటలో ఆర్‌డిఒ, డిఎస్‌పి పర్యటించకపోవడం బాధాకరం

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ ఐక్యంగా ఉండి సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన దళితులు ఉప కులాలవారీగా పరస్పర దాడులు చేసుకోవడం బాధాకరమన్నారు. గతంలో నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా భీమవరం ప్రాంతంలో నాటి ఎంఎల్‌ఎ ఒక వర్గాన్ని రెచ్చగొట్టి ఘర్షణల్లో దళితులను ఇరికించారని గుర్తు చేశారు. ఆనాడే రాజకీయ కోణంలో దళితులను బలి పశువులను చేయొద్దని కెవిపిఎస్ ఆందోళన చేసిందని గుర్తు చేశారు. రాజకీయ స్వలాభం కోసం దళితుల మధ్య చీలికలు తెచ్చే విధంగా ప్రయత్నించడం సబబు కాదన్నారు. ఘటన జరిగి పది రోజులు దాటినా నేటికీ ఆర్‌డిఒ, డిఎస్‌పి గ్రామంలో పర్యటించకపోవడం అన్యాయమన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి వెంటనే ఈ ఘటనపై స్పందించాలని, గ్రామంలో శాంతి, సామరస్యం విలసిల్లేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఘటన గ్రామంలో జరిగితే శాంతి కమిటీ తణుకులో వేయడమేంటని ప్రశ్నించారు. ఈ ఘటనపై త్వరలోనే జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను కెవిపిఎస్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తామని క్రాంతిబాబు తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు, దళితులు భీమన్న, బాలకృష్ణ, నాగరాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గరగపర్రు వంతెనపై ఇరుక్కున్న కంటైనర్

రాకపోకలు నిలిచిపోవడంతో వాహనాదారుల అవస్థలు

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు ప్రధాన రహదారి వంతెనపై భారీ కంటైనర్ శుక్రవారం ఇరుక్కుపోయింది. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వస్తున్న భారీ కంటైనర్ వంతెనపై ఉన్న రైలింగ్ అడ్డబడి ఇరుక్కుపోయి ముందుకు, వెనక్కి కదిలే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్కానింగ్ సెంటర్లలో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని మెడ్ క్వెస్ట్ స్కానింగ్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ మిషను, రిజిస్ట్రేషన్ కాల పరిమితి, ఫారం-ఎఫ్ నిర్వహణ, ఐఇసి గోడ పత్రికల ప్రదర్శన తదితర అంశాలను పరిశీలించి మాట్లాడారు. నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు.

ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి: ఎంఎల్‌సి గోపిమూర్తి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేస్తోందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం మండలంలో కృతజ్ఞతా పర్యటన నిర్వహించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను ప్రతిరోజూ రాత్రి వరకు వెబెక్స్ సమావేశాలతో హింసిస్తున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ పేరుతో మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. పిఆర్‌సిని వెంటనే నియమించాలని, బకాయి డిఎలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు శివప్రసాద్, పి.శ్రీదేవి, హైస్కూల్ హెచ్‌ఎం మైనం సత్యనారాయణ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి – పెనుమంట్ర

హాస్టల్‌లో ఉండి చదువుకునే విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని పెనుమంట్ర పిహెచ్‌సి వైద్యాధికారి సంతోష్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పొలమూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి ఎవిఎ.సూర్యనారాయణ, పిహెచ్‌ఎన్.వెంకటరమణ, వైద్య సిబ్బంది, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి – గణపవరం

డెంగీ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం గణపవరం మూడో సచివాలయ పరిధిలోని ప్రజలకు పిహెచ్‌సి సిబ్బంది అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు మాట్లాడుతూ జులై నెలాఖరు వరకూ తమ సిబ్బంది స్థానికులకు డెంగీపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. వ్యాధుల నివారణకు పరిసరాల శుభ్రత అవసరమని తెలిపారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎచ్‌ఎన్ సిహెచ్.సత్యవతి, ఎం.బాలమురళీ కృష్ణ, వర్మజ, ఎంఎల్‌హెచ్‌పి పాప పాల్గొన్నారు.

సీసలిలో గ్రామోత్సవం

కాళ్ల:సీసలిలో పోలేరమ్మకు ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం ఘనంగా సారె సమర్పించారు. సుమారు 300 మంది మహిళలు 500 కేజీల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులతో నిండిన సారె బిందెలు, కావిళ్లతో మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన గ్రామాధ్యక్షులు నూకల భోగేంద్రబాబు, వాసూరి శ్రీనివాస్, గణేష్ పద్మారావు, తోట రామకృష్ణ, మోహన్ తేజ పాల్గొన్నారు.

రాయలం అంగన్‌వాడీ సెంటర్ భేష్

భీమవరం టౌన్: అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు పోషక విలువలతో కూడిన కూరగాయలు అందించేందుకు సెంటర్లలో ఏర్పాటు చేసిన పోషణ వాటిక సెంటర్లను ప్రతి ఒక్కరూ సక్రమంగా నిర్వహించాలని ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం రాయలం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. అయితే రాయలం అంగన్వాడీ సెంటర్ 5లో ఏ సెంటర్లోనూ లేని విధంగా కూరగాయల తోటలు తలపించే విధంగా అక్కడ సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయల తోటలు ఆకర్షించాయి. దీంతో అంగన్వాడీ టీచర్ మహాలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురికి మూడేళ్లు జైలు

పాలకొల్లు :దారి దోపిడీ కేసులో ముగ్గురు ముద్దాయిలకు 3 సంవత్సరాలు జైలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. పోలీసుల కథనం ప్రకారం. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలకు చెందిన నెక్కంటి సాయిబాబు 2024 మే 20న వైజాగ్ నుండి తన అత్తవారింటికి యలమంచిలి వెళ్తూ రాత్రి 11.30 గంటలకు దిగమర్రు బైపాస్ వద్దకు వచ్చారు. ముద్దాయిలైన నరసాపురానికి చెందిన పొన్నాడ దుర్గా ప్రసాద్, జోశ్యుల సుబ్రహ్మణ్య విశ్వేశ్వర్, అలమూరుకు చెందిన వంకా ప్రభుదేవ మోటార్ సైకిల్‌పై వచ్చి సాయిబాబుకు లిఫ్ట్ ఇస్తామని బండి ఎక్కించుకుని, నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి చాకుతో బెదిరించి అతని వద్ద 2 కాసుల బంగారు దస్తా, ఉంగరం, ఫోన్, రూ. 600 నగదు బలవంతంగా లాక్కుని వెళ్లిపోయారు. సాయిబాబా ఫిర్యాదుపై నాటి రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేశారు. పాలకొల్లు రూరల్ సిఐ శ్రీనివాస్ నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. పాలకొల్లు అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.ఎస్.ఎస్.లక్ష్మీ లావణ్య విచారించి ముద్దాయిలు ఒక్కొక్కరికీ మూడేళ్ల సాధారణ కారాగార శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఉచిత ర్యాబిస్ టీకాలు

ప్రజాశక్తి – వీరవాసరం

ఈనెల 6వ తేదీన పెంపుడు జంతువులకు, వీధి కుక్కలకు ఉచిత ర్యాబిస్ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి ప్రియాంక రాబర్ట్ శుక్రవారం తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వీరవాసరం సంత సమీపంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు టీకాలు వేయబడునున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్నా క్యాంటీన్లు

ప్రజాశక్తి – ఆచంట

పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించి వారి ఆకలి తీర్చడానికే అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఎల్‌ఎ పితాని తనయుడు పితాని వెంకట అన్నారు. శుక్రవారం ఆచంట కచేరీ సెంటర్‌లో రూ.61 లక్షలతో నిర్మించనున్న అన్నా క్యాంటీన్ పనులను పరిశీలించి మాట్లాడారు. భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు చిలుకూరి సీతారాం, గొడవర్తి శ్రీరాములు, సిద్దాంతం పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన ఉండాలి

తాడేపల్లిగూడెం:ప్రతి ఒక్కరికీ హెచ్‌ఐవి, టిబి, లెప్రసీపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టిబి, అధికారి డాక్టర్ కోపారి దేవికుమార్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పాత ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లాలోని ఐసిటిసి, ఎఆర్‌టి, డిఎస్ఆర్‌సి, ఎస్‌జిఒ సిబ్బందితో ఆయన సమీక్షించి మాట్లాడారు. హెచ్‌ఐవి పరీక్షలు క్షేత్రస్థాయిలో రిస్క్ ఉన్న ప్రాంతాల్లో నిర్వహించాలన్నారు. ప్రతి గర్భిణికీ తప్పనిసరిగా హెచ్‌ఐవి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ నెల 8వ తేదీన నిర్వహించే ఆశా డేలో పిహెచ్‌సి సిబ్బందితో హెచ్‌ఐవి, లెప్రసీపై అవగాహన సదస్సులు జరపాలన్నారు.

దాతల సహకారం అవసరం

ఆచంట:ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సౌకర్యార్థం దాతల ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంఎల్‌ఎ తనయుడు పితాని వెంకట అన్నారు. కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొడమంచిలి శివారు బోళ్ల ప్రగడ వారి గ్రామానికి చెందిన వేటుకూరి నీటి సంఘం మెంబర్ ఎల్లమిల్లి శ్రీనివాసరావు కొడమంచిలి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సిసి కెమెరాలు బహూకరించారు. ఈ సందర్భంగా పితాని వెంకట్ శుక్రవారం ఆ పాఠశాలలో సిసి కెమెరాలను ప్రారంభించారు. కేతా మీరయ్య, వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

పార్సిల్ రవాణా సంస్థలు డెలివరీ చేసే సరుకులపై అవగాహన కలిగి ఉండాలని, అనుమానిత పార్సిల్స్ వస్తే వివరాలను ఎక్సైజ్ సిబ్బందికి అందించాలని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుధాలక్ష్మి అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిబ్బందితో పార్సిల్ కార్యాలయాలు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు పార్సిల్ గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్సిల్ సంస్థలు, కొరియర్ కార్యాలయాలు చట్ట విరుద్ధమైన వస్తువులు రవాణా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో తాడేపల్లిగూడెం ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్.దొరబాబు, మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం

మొగల్తూరు:ప్రయివేటు పాఠశాలలకు దీటుగా తమ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నామని హెచ్‌ఎం ఉమామహేశ్వరి అన్నారు. పేరుపాలెం కొమ్మూరి సతీష్ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని గుత్తుల వాసవి పెద్దిరెడ్డి ట్రిపుల్ ఐటీలో ప్రవేశం కైవసం పొందింది. ఈ సందర్భంగా విద్యార్థిని పెద్దలక్ష్మిని పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సర్పంచ్ త్రిమూర్తులు, గుండు సుబ్బారావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి.సూర్యకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈకింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

జిల్లాలో సీతారామరాజు జయంతి వేడుకలు



పాలకొల్లు : అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి – పాలకొల్లు

సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, దాని కోసమే తన ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ క్లబ్, క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన టిడిపి వేడుకల్లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలవేసి ఆయన నివాళులర్పించారు. పాలకొల్లు ఛాంబర్ కళాశాల వద్ద ఆడిటర్ రామరాజు కాంస్య విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తాని తెలిపారు. అనంతరం మంత్రిని ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌లు అందించారు. వృద్ధులకు నిత్యావసర సరుకులు, రోగులకు ఆర్థిక సాయం చేశారు. సభకు కాస్మో అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అధ్యక్షత వహించారు. కార్యదర్శి వేగేశ్న సోమరాజు, క్షత్రియ పరిషత్ కార్యదర్శి చేకూరి సూరిబాబు, కెవి కృష్ణవర్మ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఉన్నమట్ల కబర్ధి, కూటమి నేతలు పాల్గొన్నారు.

తణుకు:బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై అనేక సార్లు పోరాటాలు చేసిన ఘనత మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకే దక్కిందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని వేల్పూరు రోడ్డులోని విమాక్స్ థియేటర్ సెంటర్ వద్ద సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అల్లూరి ఆశయాలు, స్ఫూర్తి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరం: సీతారామరాజు జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఒకటో పాఠశాల విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. భువనపల్లి వెలంపేటలోని పాఠశాల విద్యార్థులు 40 మందికి నోట్ పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు, శానిటైజర్ బాటిళ్లు అందజేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెలంకి నరేష్, కిలారి రవిబాబు, కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, రావూరి నాగరాజు, కూనశాని నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే జగన్నాథపురంలో క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు స్వీట్లు పంపిణీ చేశారు అనంతరం అల్లూరి విగ్రహనికి నివాళులర్పించారు. ఎల్ఐసి సోమరాజు సుబ్బరాజు, క్షత్రియ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ నిర్మలాకుమారి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అల్లూరి జీవితం నేటి యువతికి ఆదర్శమని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు తెలిపారు. అర్ధవరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. సమావేశానికి కట్టురి ప్రసాద్ అధ్యక్షత వహించారు. మండల నాయకులు చిన్నం వంశీ, బళ్లారపు అశోక్, కె.శేఖర్‌బాబు పాల్గొన్నారు. భారత రత్న ఇవ్వాలని అఖిల భారత హ్యాండ్‌లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు జూనియర్ కాలేజీ వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎ.నాగసీతయ్య, అబ్దుల్ వాహెబ్, ఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

కాళ్ల : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సర్పంచి కొనకంచి సూర్యనారాయణ మూర్తి అన్నారు. కోలనపల్లిలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో వేగిరాజు మురళీ కృష్ణంరాజును సత్కరించి రూ.5 వేల నగదు సర్పంచి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. ఏటా అల్లూరి జయంతి సందర్భంగా గ్రామంలో ఒక వ్యక్తికి సన్మానం చేసి నగదు అందజేస్తున్నట్లు సర్పంచి తెలిపారు. ఉప సర్పంచి వేగేశ్న నారాయణరాజు, తోటకూర అప్పలరాజు, వేగిరాజు గాంధీరాజు, దండు విశ్వనాథరాజు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెదఅమిరం, కోపల్లె, కలవపూడి గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆచంట : అల్లూరి సీతారామరాజును యువత ఆదర్శంగా తీసుకోవాలని జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. వల్లూరులో జనసేన గ్రామ అధ్యక్షులు కమిడి ఉమా మహేశ్వరస్వామి ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన ఆచంట మండల ఉపాధ్యక్షులు తోట ఆదినారాయణ, టిడిపి సీనియర్ నాయకులు బండి వెంకటేశ్వరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకోడేరు: పాలకోడేరులో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. మోగల్లులో అల్లూరి విగ్రహాలకు సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ , సిపిఎం సీనియర్ నాయకులు పాల వెంకటస్వామి , నాయకులు వెంకన్న, పాలకోడేరులో ఎస్ఆర్ నగర్ పోరాట కమిటీ సభ్యులు రామారావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మరియమ్మ, రామారావు పాల్గొన్నారు.

ఆకివీడు: తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం కార్యాలయం వద్ద, దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరికి అంజలి ఘటించారు. కళాశాల ప్రణాళిక అభివృద్ధి విభాగం కార్యదర్శి డాక్టర్ పిబి.ప్రతాప్‌కుమార్, ప్రిన్సిపల్ శారద మాట్లాడారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లూరి జయంతి సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాజశేఖర్, సిబ్బంది, విద్యార్థులు ఆయనకు నివాళులర్పించారు. విశ్రాంతి ఉద్యోగి, పూర్వపు విద్యార్థి సిహెచ్ మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండి : అల్లూరి సీతారామరాజు స్మారక నాణెం ముద్రించాలని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి జయంతి వేడుకలు లయన్స్ క్లబ్ ఆధర్వంలో నిర్వహించారు. రంగరాజు, క్లబ్ కార్యదర్శి పెన్మెత్స రంగ ప్రసాదరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, భూపతిరాజు హరనాథరాజు మాట్లాడారు. గాదిరాజు వెంకటేశ్వరరాజు, సత్తి బ్రహ్మారెడ్డి, వెంకటరామరాజు పాల్గొన్నారు. **అలాగే** కెవిపిఎస్ ఆధ్వర్యంలో పాందువ్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాగారపు గోపాలం అధ్యక్షతన అల్లూరి చిత్రపటానికి కెవిపిఎస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదాసి గోపి మాట్లాడారు. అనంతరం హెచ్ఎం గోపాలం సౌజన్యంతో విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్ సత్యవేణి, హెల్పర్ సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : యావత్ భారత దేశంలో స్వాతంత్ర్య స్ఫూర్తి రగిలేలా మన్యంలో పోరాటానికి నాంది పలికిన విప్లవ మూర్తి అల్లూరి సీతారామరాజు అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న అల్లూరి కాంశ్య విగ్రహానికి ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, సిపిఎం మండల అధ్యక్షులు కోడె శ్రీనివాస ప్రసాద్, సిఐటియు నాయకులు ఎన్.కాంతారావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : భీమవరం పాత బస్టాండులో అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంపలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. సిరివూరి సత్యనారాయణ రాజు, మంతెన సూర్యనారాయణ రాజు, బొబ్బిలిశెట్టి రంగారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : అల్లూరి బ్రిటీష్ వారిని గడగడలాడించారని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆరోగ్య వర్షిణీ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమత్స రామరాజు, గుబ్బల నాగరాజు పాల్గొన్నారు.

యలమంచిలి : అల్తూరి జయంతిని సిపిఎం, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో చించినాడలో నిర్వహించారు. స్థానిక అమరవీరుల స్మారక భవనం వద్ద అల్లూరు చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు తెన్నేటి స్టాలిన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ నివాళులర్పించారు. నాయకులు ఎం.ఆంజనేయులు, పల్లేరు వెంకటస్వామి, వేడంగి బాబూరావు, లూథర్ బాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: స్థానిక బ్రహ్మానందం మార్కెట్‌లో ఉల్లిపాయ మార్కెట్ వర్కర్స్ యూనియన్ వద్ద బొంకూర్ నాగేశ్వరరావు అధ్యక్షతన అల్లూరు సత్యనారాయణ వర్ధంతి సభ జరిగింది ముందుగా అల్లూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, సిరపరపు రంగారావు నివాళులర్పించారు. చింతకాయల బాబూరావు మాట్లాడారు.అల్లూరు భూస్వామ్య కుటుంబాల్లో పుట్టినప్పటికీ పేదల అభ్యున్నతికి పాటుపడేవారన్నారు. గంటా కోటి గొర్రెల రమేష్ గౌడ్లు సీతయ్య దత్తు రాము, బర్ల బాలాజీ బేత అప్పారావు, పూడి బాలాజీ, గొర్ల అప్పాజీ, చల్లా మణికంఠ పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI అడిషనల్ డిస్ట్రిక్ట్ & సెషన్స్ జడ్జి వారి కోర్టులో
I.A.No. : 3640 of 2025 in I.A.No. : 273 of 2025 in A.S. 2025

బిట్వీన్ :
వరుపుల విజయలక్ష్మి ...పిటీషనరు / అప్పీలెంటు
మరియు
గనపల లక్ష్మి (Died) మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు / రెస్పాండెంట్లు

పై నెంబరు I.A.No.273 of 2025 లో రెస్పాండెంట్లు అయిన 2, 3 మరియు 5 గనసల జ్యోతి, సిరాపు సత్యనారాయణ మరియు గనసల రమేష్ లకు శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్ని పర్యాయములు నోటీసు కట్టి నప్పటికీ వారు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోనందున వారికి పై కేసు గురించి ఈ పబ్లికేషన్ ద్వారా తెలియపర్చమని పై కోర్టు వారు ఆర్డరు వేయించినారు. పై నెంబరు గల కేసు గురించి మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నప్పటికీ తేది.24-07-2025 తేది ఉదయం గం.10.30 నిముషములకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకోవలెను. లేని యెడల మీకు పరోక్షం అగును.

కె.సూర్యచంద్రరావు,
తాడేపల్లిగూడెం, న్యాయవాది, సెల్ : 95819 19670,
తేది.04-07-2025 తాడేపల్లిగూడెం-534101

వైసిపి పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి – తణుకు

గత ఐదేళ్ల వైసిపి పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. 2019 నుంచి 2024 మధ్యకాలంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా సంక్షేమాన్ని పక్కదారి పట్టించారని విమర్శించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అత్తిలి మండలం తిరుపతిపురం, వరిఘేడు గ్రామాల్లో, తణుకులోని 12, 13 వార్డుల్లో ఎంఎల్ఎ ఇంటింటా పర్యటించి జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వరిఘేడులో దీర్ఘకాల సమస్యలను ముఖ్యంగా జిల్లా పరిషత్ రోడ్డు పనులకు రూ.60 లక్షలతో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. వేసవిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సుమారు 800 ఎకరాలకు సాగునీరందించే విధంగా శాశ్వత పరిష్కారం లభించేలా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం : కూటమి ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలూ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సహకార సమైఖ్య రాష్ట్ర ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సుపరిపాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుత్తుల సాయి, కొప్పాడ రవి, పాలూరి బాబ్జి పాల్గొన్నారు.

పెనుమంట్ర : విధ్వంస పాలన నుంచి వికాసం వైపు అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వ పాలన అద్భుతంగా ఉన్నట్టు ప్రజలు కితాబిస్తున్నారని ఎంఎల్ఎ తనయుడు పితాని వెంకట్ సురేష్ అన్నారు. ఆలమూరులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. అనంతరం సుమారు 10 లక్షలతో జిఎస్ వెంకయ్య గారి వీధిలో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, కడలి ఏడుకొండలు, నీటి సంఘం ఉపాధ్యక్షులు తేతలి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మోహనరంగా

ప్రజాశక్తి – మొగల్తూరు

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేసిన వంగవీటి మోహనరంగాను నేటికీ ఆదరించడం అభినందనీయమని ఆయన కుమారుడు మాజీ ఎంఎల్ఎ రాధా అన్నారు. కాళీపట్నం తూర్పులో సొసైటీ మాజీ అధ్యక్షులు మేడిది బాబ్జి ఏర్పాటు చేసినరంగా విగ్రహాన్ని ఆయన విప్ బొమ్మిడి నాయకర్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగా ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు. విప్ నాయకర్ మాట్లాడారు. డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, సర్పంచి మేడిది సౌజన్య ప్రభాకర్ పాల్గొన్నారు.

పాలకొల్లు: వంగవీటి మోహన రంగా విగ్రహానికి మంత్రి నిమ్మల రామానాయుడు నివాళులర్పించారు. రంగా అభిమానులు రూ.10 వేలను నిరుపేద ఒంటరి మహిళ మంగాదేవికి మంత్రి చేతులమీదుగా ఆర్థిక సాయం అందజేశారు.మంత్రి మాట్లాడారు. మాజీ ఎంఎల్ఎ బాబ్జి, మాజీ ఎంఎల్‌సిలు అంగర రామ్మోహన్, మేకా శేషుబాబు పాల్గొన్నారు.

భీమవరం టౌన్:బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మోహనరంగా అని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం తహశీల్దార్ కార్యాలయ రోడ్డులోని వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద విఎంఆర్ కాపుమిత్ర యర్రంశెట్టి శివకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం మోహన్ రంగా జయంతిని నిర్వహించారు. రంగా విగ్రహానికి నివాళులర్పించి పేదలకు దుప్పట్లు, భోజనాలు అందించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

తణుకు : పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వంగవీటి మోహనరంగా నిరంతరం కృషి చేశారని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకుని తణుకు వెంకటేశ్వర థియేటర్ సెంటర్ వద్ద రంగా విగ్రహానికి ఎంఎల్ఎ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కార్పొరేటర్ నుంచి ఎంఎల్ఎ స్థాయికి ఎదిగిన వ్యక్తి వంగవీటి మోహన్ రంగా అని రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మిక బోర్డు ఛైర్మన్ వలవల బాజ్జీ పేర్కొన్నారు. స్థానిక గొల్లగూడెం సెంటర్, తణుకు రోడ్డులో వంగవీటి మోహన్ రంగా జయంతిని నిర్వహించి మాట్లాడారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న రంగా యూత్ సభ్యులు కులపర్తి సుబ్బారావుకు రంగా యూత్ సభ్యులు రూ.13,000 అందజేశారు.

ఆచంట : వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు ఆచంట కచేరీ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతర యువకులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

నరసాపురం : కోటిపల్లివారి వీధిలో జరిగిన కార్యక్రమానికి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, కాంగ్రెస్ కన్వీనర్ పోలిశెట్టి బాబీ, జక్కం బాబ్జి ముఖ్య అతిథులుగా విచ్చేసి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. కొప్పర్రులో జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No. 9/2024 in O.S.No. 200/2016

బిట్వీన్ :
నల్లగోపు దైవ వరప్రసాదరావు ...పిటీషనరు/వాది/Dhr
మరియు
కోటిచుక్కల మల్లేశ్వరరావు ...రెస్పాండెంట్/ప్రతివాది/Jdr

రెస్పాండెంట్/ప్రతివాది/Jdr:
కోటిచుక్కల మల్లేశ్వరరావు, తండ్రి: శ్రీరాములు, పురుషుడు, వయస్సు 47 సం॥లు, డోర్ నెం: 14-29-1 28 వ వార్డు, మాలకొండ చెర్వు దగ్గర, H.P.GAS రోడ్డు, తాడేపల్లిగూడెం-1, పిన్-534101, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు ద్వారా రెస్పాండెంట్/ప్రతివాది/Jdr కి పలుమార్లు నోటీసులు పంపించినప్పటికి రెస్పాండెంట్/ప్రతివాది/Jdr తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్ట్ వారు SUBSTITUTE ఉత్తర్వులు ప్రకారం **ది. 09-07-2025వ సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్ట్ వారి యెదుట రెస్పాండెంట్/ప్రతివాది/Jdr స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును. అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి అనుమతితో)
దూలం వెంకట విజయకుమార్
తాడేపల్లిగూడెం పిటీషనర్/వాది/Dhr అడ్వకేటు,
తేది. 02-07-2025 తాడేపల్లిగూడెం
సెల్: 98485 77222, 95459 34567

ప్రజాశక్తి – భీమవరం

పోరాటయోధుడు అల్లూరు సత్యనారాయణ

వర్ధంతి సభలో నేతలు



తాడేపల్లిగూడెం : అల్లూరి, అల్లూరు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

అలుపెరగని పోరాట యోధుడు అల్లూరు సత్యనారాయణ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ 11వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వాసుదేవరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో వాసుదేవరావు మాట్లాడుతూ చట్టాలు అమలు కానీ రోజుల్లో కార్మికులను సంఘటితం చేసి హక్కులు సాధించారని కొనియాడారు. అల్లూరు పోరాటం స్ఫూర్తితో లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకూ పోరాడాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.వైకుంఠరావు, డి.నాగేశ్వరరావు, కె.కోదండం, పి.అప్పన్న, బి.అప్పారావు, రమణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉద్యమ నేత అల్లూరు సత్యనారాయణ, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు పోరాటాలు సాగించాల్సి ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అల్లూరు సత్యనారాయణ వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి సభ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అల్లూరు సత్యనారాయణ చిత్ర పటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు పతివాడ నాగేంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో అల్లూరు ఒకరు అన్నారు. అల్లూరు సత్యనారాయణ ఆశయ సాధనకు పోరాటాలు సాగించాల్సి ఉందన్నారు. తాడేపల్లిగూడెం నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సత్తికోదండ రామిరెడ్డి, చిటికిన రాము, శిద్దిరెడ్డి శేషుబాబు, నరమాల కృష్ణ, దేశంశెట్టి సతీష్, యాసరపు ఎర్రి నాయుడు, పి.రమణ, కుంచంగి నానాజీ, ఏపూరి శ్రీను పాల్గొన్నారు.

ఆకివీడు : కార్మికుల, కష్టజీవుల ఆశాజ్యోతి అల్లూరు సత్యనారాయణ ఆశయ సాధనకు కమ్యూనిస్టులు కృషి చేయాలని సిపిఎం ఏరియా కమిటీ నాయకులు పెంకి అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ ఆఫీసు వద్ద సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లా సిపిఎం పార్టీ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించారన్నారు. బొడ్డుపల్లి రాంబాబు, డోకల రవితేజ, రంగ, కె.గౌరీనాయుడు, ఎండి అన్సారీ పాల్గొన్నారు.

పెంటపాడు:అల్లూరు సత్యనారాయణను ఆదర్శంగా తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద దూలం ప్రసాద్ అధ్యక్షతన అల్లూరు సత్యనారాయణ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం అపరాల మార్కెట్ సమస్య, ఉల్లిపాయ మార్కెట్ సమస్య, తాడేపల్లిగూడెం రైల్వే గుడ్ షెడ్ వర్కర్స్ యూనియన్‌లో యజమానులకు కార్మికులకు మధ్య వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యక్ష పాత్ర పోషించారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ అల్లూరు భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద బలుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఉమ్మడిగా వచ్చిన తన ఆస్తిని కూడా విక్రయించి ఆ సొమ్మును పార్టీకి విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఆయన నమ్మిన సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో గంటా కోటి, గొర్ల రమేష్, దొర్లు సీతయ్య, బేతా అప్పారావు, దత్తు రాము, బర్ల బాలాజీ, పూడి బాలాజీ పాల్గొన్నారు.

పోడూరు : అల్లూరు సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు నాయకులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ అల్లూరు సత్యనారాయణ చేసిన సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సిఐటియు నాయకులు చింతకాయల బాబూరావు, సిఐటియు మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, కెవిపిఎస్ మండల నాయకులు కాకర వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అమ్మాజీ పాల్గొన్నారు.

నరసాపురం : అల్లూరు సత్యనారాయణ వర్ధంతినిస్థానిక మీరా గ్రంథాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అల్లూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో రైస్ మిల్ హమాలి కార్మికుల హక్కుల కోసం అహర్నిశలూ కృషి చేసిన కార్మిక పక్షపాతి అల్లూరు సత్యనారాయణ రాజు అని కొనియాడారు. సిఐటియు నాయకులు జవాది శ్రీనివాస్, ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు ఆకుల హరేరామ్, మామిడిశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు

పెనుమంట్ర : అల్లూరు సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా బ్రాహ్మణచెరువు రైస్‌మిల్లు వద్ద సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్, సిఐటియు జిల్లా నాయకులు కేతా గోపాలన్, రైస్ మిల్లు, జట్టు మేస్త్రి మా దాసు లక్ష్మణరావు, కార్మికులు పాల్గొన్నారు.

ఆచంట : అల్లూరు సత్యనారాయణ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. అల్లూరు వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. సిపిఎం మండల సభ్యులు కుసుమే జయరాజు, హుస్సేన్, ఏడుకొండలు రాంప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) ELURU
E.A.No.126/2025 in E.P.No.56/2020
O.S.No.204/2011

Between:
Smt. Garapati Keerthy ...Petitioner/3rd Party
Vs
Maganti Subrahmanya Chowdary (Died)
And others ...Respondents.

NOTICE

5. Pusuluri Srinivasa Rao, Son of Sambasiva Rao, Plot No.205, Sri Lakshmi Sai Towers, Mandavari Street, Satrampadu.
6. Vemuri Vijayalakshmi, Wife of Koteswara Rao, H.No. 2-66/2, Chataparru. EJCJ.

Whereas the Petitioner filed the above petitioner in to permit the petitioner to deposit the decretal amount along with suit and advocate fee in the execution petition.

Whereas as the notice addressed to the respondents 5 & 6 in the above petition could not be served as last known address and the notice could not be served;

Respondents 5 & 6 by substituted service by way of publication;

You, are hereby called upon to appear in person before this Honourable court Eluru on10-07-2025 at 10-30 A.M and state your objections if any. Lest the petition will be decided ex-parte.

(As per court orders)
DEVULAPALLI KRISHNA SASTRY
Eluru Advocate,
Date: 01-07-2025 Eluru